క్లుప్తంగా

వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోండి

తిరుపతి అర్బన్: ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నివారణకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసిందని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీవోఏ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ పోర్టల్‌లో సమస్యను నమోదు చేస్తే పోలీస్, రెవెన్యూ, సంక్షేమశాఖ, జ్యుడీషియల్ విభాగాలకు సమస్య సమాచారం తెలుస్తుందని వెల్లడించారు. దీంతో సమస్యకు త్వరగా పరిష్కారం లభిస్తుందని వివరించారు.

శ్రీవారి సేవలో వ్యాసరాయ మఠం పీఠాధిపతి



ధ్వజ స్తంభం ముందువ్యాసరాయ మఠం పీఠాధిపతి విద్యా తీర్థ స్వామీజీ

తిరుమల: శ్రీవారిని వ్యాసరాయ మఠం పీఠాధిపతి విద్యా తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. బుధవారం తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

టీటీడీ ఆలయాల్లో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ స్థానిక ఆలయాల్లో డిసెంబర్ నెలలో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా డిసెంబర్ 10న శ్రీగోవిందరాజస్వామి వారు తిరుపడి సన్నిధికి వేంచేపు చేశారు. 11న శ్రీకపిలేశ్వరాలయంలో కార్తీక సోమవారాభిషేకం నిర్వహిస్తారు. 17వ తేదీన తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంతోపాటు ఇతర ఆలయాల్లో ధనుర్మాసం ప్రారంభం కానుంది. 22 నుంచి 26వ తేదీ వరకు శ్రీకపిలేశ్వరాలయంలో స్వామివారి తెప్పోత్సవాలు వేడుకగా చేపట్టనున్నారు. 23వ తేదీన శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి నిర్వహిస్తారు. 27వ తేదీన శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో ఆరుద్ర దర్శన మహోత్సవం నిర్వహించనున్నారు.

ఎస్వీయూ వీసీకి ఘన సన్మానం



వీసీని సన్మానిస్తున్న వైఎస్‌ఆర్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీ రెడ్డి, ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన సుందరవల్లిని వైఎస్ఆర్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీరెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్వీయూకు మొదటి మహిళా వీసీగా సుందరవల్లి బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు. యూనియన్ నాయకులు ప్రభాకరరెడ్డి, అజీమ్, లోకేష్, గౌరీ, ప్రకాష్, గిరి, రాజేంద్ర, రవితో పాటు సుమారు 60మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు రాబోయే కాలంలో ఉమ్మడి ఉద్యమం అవసరమని రెవల్యూషనరీ విద్యార్థి సంఘం రాష్ట్ర రవిశంకర్‌రెడ్డి తెలిపారు. బుధ వారం ఆర్ఎస్‌యూ జిల్లా మహాసభ ఎస్వీ ఐటీఐలో నిర్వహించారు. ఆర్ఎస్‌యూ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా క్రిష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరీష్, జిల్లా ఉపాధ్యక్షులుగా అభిషేక్, సత్య, జిల్లా సహాయ కార్యదర్శులుగా నవీన్, శివాజీ, కార్తీక్, కోశాధికారిగా ధనుష్‌ను నియమించారు.

తిరుమలలో తమిళనాడు మహిళ అదృశ్యం

తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ దంపతుల్లో భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుమల వన్ టౌన్ పీఎస్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాలు... తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరు జిల్లా, తిరుత్తణికి చెందిన జయరామన్ పుణ్యకోటి, జ్యోతిలక్ష్మి(58) దంపతులు ఈ నెల 22న తిరుమలకు వచ్చి శ్రీవారి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం బయటకు వచ్చి భక్తుల రద్దీతో విడిపోయారు. దీంతో భర్త ఆమె కోసం వెతికినా కనపడలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును నమోదు చేశారు. అదృశ్యమైన మహిళకు చెవుడు, నత్తి ఉంది. మహిళను గుర్తిస్తే నెం.08772289027కు సమాచారం అందించాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు వినికిడి పరికరాలు

- చిన్నారులకు వినికిడి పరికరాల పంపిణీతో ఆత్మసంతృప్తి
- జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి



విభిన్న ప్రతిభావంతులకు వినికిడి యంత్రాలను అందిస్తున్న జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: విభిన్న ప్రతిభావంతాలకు వినికిడి పరికరాలను పంపిణీ చేయడం ద్వారా ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద శారీరక లోపం గల విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు కలెక్టర్ చేతులమీదుగా వైద్యాధికారులు వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. రుయా ఆస్పత్రిలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ అనుబంధంగా ఉన్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య కేంద్రంలోని శారీరక లోపం గల విభిన్న ప్రతిభావంతులకు ఆర్థోస్టిక్, ప్రోస్థస్టిక్ పరికరాలు, వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు వినికిడి పరికరాలను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, అడిషనల్ డీఎంహెచ్ఓ అరుణ సులోచన దేవి, డీపీఎంఓ శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ సర్వేలైన్స్ ఆఫీసర్ తేజేశ్వరి, డాక్టర్ పద్మావతి, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

జగనన్న పాలన.. సుపరిపాలన





ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, జగనన్న అందించిన సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్ఆర్ సీపీ జెండా ఆవిష్కరణ

తిరుపతి మంగళం: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా.. పేదల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ తెలిపారు. అధికారంలో లేకపోతే తమలాంటి లక్షలాది మంది పేదలకు జీవితమే లేదని తిరుపతి 14, 26వ డివిజన్లలోని ప్రజలు చెబుతున్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక తమ జీవితాలకు భరోసా కల్పించారని, సంక్షేమ పథకాలతో సుభిక్షంగా జీవిస్తున్నామని స్థానిక ప్రజలంతా సంతోషంగా చెప్పారు. మళ్లీ జగనన్నే మాకు సీఎంగా కావాలని ముక్తకంఠంగా చెప్పారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 14, 26వ డివిజన్లలో బుధవారం «ఏపీకి జగనే ఎందుకు కావాలంటే» అన్న కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పడమటి కుమార్, కార్పొరేటర్లు కోటూరు ఆంజినేయులు, తాజిన్, వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథ్‌రెడ్డి, రాపూరి ప్రసాద్, కుమార్, కోటూరు శశి పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని పూజలు

తిరుపతి కల్చరల్: ఈ నెల 30వ తేదీ గురువారం తెలంగాణ రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ విజయం సాధించి మూడోసారి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఆ పార్టీ నేతలు బుధవారం తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు చేసి 101 కొబ్బరి కాయలు కొట్టారు. బీఆర్ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో జోరు వాన



చంద్రగిరిలో కురుస్తున్న వర్షం

చంద్రగిరి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండల వ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మరో నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు వెల్లడించినట్లు, ప్రజలందరూ అప్రమత్తంగా మెలగాలని రెవెన్యూ అధికారులు సూచించారు.

వర్షాకాల హెల్ప్‌లైన్ ఏర్పాటు

తిరుపతి కల్చరల్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పడుతున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని 0877–2256766 హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 బుధవారం నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు రాబోయే భారీ వర్షాల కారణంగా తిరుపతి నగర పాలక సంస్థ ముందస్తు చర్యల్లో భాగంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు ల్యాండ్‌లైన్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించి, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయసేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

స్విమ్స్ ఐసీటీసీకి ఎన్ఏబీఎల్ అవార్డు



ఐసీటీసీ సిబ్బందిని సత్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ సెంటర్ హెచ్ఐవీ టెస్టింగ్ ల్యాబ్ (ఐసీటీసీ)కి న్యూఢిల్లీకి చెందిన క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెడికల్ (ఎంట్రీ లెవెల్) టెస్టింగ్ ల్యాబ్స్ వారు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ క్యాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) అవార్డును ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. స్విమ్స్ ఐసీటీసీ ద్వారా మెరుగైన ప్రయోగశాలలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తుందని గుర్తించారు. పరికరాల అమరికలు, రికార్డులు, నివేదిక, నిర్వహణ కచ్చితమైన ఫలితాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా బుధవారం అవార్డును తీసుకున్న ఐసీటీసీ సిబ్బందిని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ అభినందించారు. స్విమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ అర్చన, కౌన్సిలర్ వేంకటేశ్వర్లు, టెక్నీషియన్ వంశీకృష్ణ, ఫణి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌యూలో క్యాన్సర్ అవేర్‌నెస్ క్యాంప్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీ క్యాన్సర్ కేర్ సెంటర్ డాక్టర్లు, వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్, తిరుపతి శ్రీవేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్ అవేర్‌నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమశ్రీ ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్సిటీలో క్యాన్సర్ కేర్ సెంటర్ సహకారంతో అవగాహన కార్యక్రమం చేపట్టడం ఆవశ్యకమన్నారు. వర్సిటీలోని విద్యార్థులకు, ఉద్యోగులకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ కేర్ సెంటర్ డాక్టర్లు బాలదత్తాత్రేయ, శ్వేత, జి.అనూష, ఆసుపత్రి సిబ్బంది, వర్సిటీ అధికారులు ప్రొఫెసర్ రాధాగోవింద, డాక్టర్ చందూలాల్, డాక్టర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.51.40 లక్షలు



హుండీ కానులకు లెక్కిస్తున్న స్వచ్ఛంద సేవకులు, భక్తులు, ఆలయ సిబ్బంది

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.51,40,601 ఆదాయం లభించినట్లు ఈవో కె.మమత తెలిపారు. ఈ మేరకు బుధవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా నగదుతో పాటు 50 గ్రాముల 150 మిల్లీ గ్రాముల బంగారం, 664 గ్రాముల 500 మిల్లీ గ్రాముల వెండి లభించింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈస్ట్ పోలీసు సిబ్బంది, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, పర్యవేక్షణ అధికారి ఎ.జయకుమార్, స్వచ్ఛంద సేవకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యువత కోసమే ఆడుదాం ఆంధ్రా

- గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకే....
- అధికారుల సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ రమేష్‌బాబు



పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

తిరుపతి రూరల్: యువతను క్రీడల వైపు నడిపించి, వారి క్రీడా నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా శారీరక దృఢత్వాన్ని పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తిరుపతి రూరల్ ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలం పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో ఆడుదాం ...ఆంధ్ర కార్యక్రమంపై సమీక్షించారు. 15 ఏళ్లు దాటిన ప్రతి యువత ఈ క్రీడా సంబరంలో భాగస్వామ్యులను చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే యువత రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం అయిందని, సచివాలయం సిబ్బంది సమన్వయంతో ఎక్కువగా యువత ఈ క్రీడల్లో పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. డిసెంబర్ 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. పరిపాలనాధికారి పిచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో దర్శకుడు పరశురామ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం సినీ దర్శకుడు పరశురామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ఆయనకు దర్శన ఏర్పాట్లు చేశారు. దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

భాష్యం ఆధ్వర్యంలో మెగా క్విజ్



బహుమతులు అందుకున్న విజేతలతో జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: బైరాగి పట్టెడ గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో బుధవారం భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ మార్గదర్శకత్వంలో వివా ఎడ్యుకేషన్ మెగా క్విజ్ పోటీని నిర్వహించారు. తిరుపతి, ఒంగోలు జోన్ల మధ్య ఈ పోటీ నిర్వహించారు. మెగా క్విజ్ పోటీలో తిరుపతి జోన్ విన్నర్స్‌గా, ఒంగోలు జోన్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ మెగా క్విజ్ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు చదువులతోపాటు ప్రాపంచిక జ్ఞానాన్ని కల్పించాలనే వివిధ రకాలుగా పోటీలు నిర్వహిస్తున్నామని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలియజేశారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

రామచంద్రాపురం: మండలంలోని మిట్టూరు భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు ఎంఈఓలు మార్కండేయనాయుడు, జయవేలు, కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల హెచ్ఎం వాగ్దేవి బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ఈ ట్యాబ్‌లు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ అందిస్తున్నట్లు తెలిపారు. సహిత విద్య ఉపాధ్యాయులు రాజేశ్వరి, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుదిపట్లలో చెవిరెడ్డి లక్ష్మికి అపూర్వ ఆదరణ



పుదిపట్లలో గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

- గడప గడపలోనూ ఆత్మీయ పలకరింపు
- రానున్న ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించాలని పాదయాత్ర

తిరుపతి రూరల్: గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి బుధవారం తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీలో పాదయాత్ర చేపట్టారు. ఆమె పాదయాత్రకు గ్రామస్తుల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు మంగళహారతులతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పార్టీలకు అతీతంగా గ్రామస్తులు పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటారు. గడప గడపకు వెళ్లి గత నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి, గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తమ గ్రామానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన మేలును గుర్తు చేసుకుంటూ ఆయన కుమారుడిని తప్పకుండా ఆదరిస్తామని మాట ఇచ్చారు. పుదిపట్ల, చైతన్య పురం గ్రామాల్లో పర్యటించిన ఆమె కనిపించిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా పుదిపట్ల గ్రామంలో తుడా నిధులతో మంజూరు చేసిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సిమెంటు రోడ్లు వంటి వాటిని అక్కడి గ్రామస్తులకు గుర్తు చేశారు. వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు శ్రీరాములు, వెంకటేష్ యాదవ్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మహేంద్ర, గోపి, సుబ్రమణ్యంనాయుడు, దిలీప్‌చౌదరి, నవీన్, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.



డ్రోన్‌ల ద్వారా పంటలకు మందుల పిచికారీ విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

పేదరిక నిర్మూలనకు పెద్ద పీట

భాకరాపేట: గ్రామీణ పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని సర్పంచులు సింహాల విమల, మాధవి అన్నారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని జంగావాండ్లపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీల్లో వికసిత్ భారత్ యాత్ర నిర్వహించారు. ఈవో పీఆర్‌డీ సోమశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు మోహన్‌రెడ్డి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కంటి అద్దాలు పంపిణీ



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటరత్నం తదితరులు

చంద్రగిరి: పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లెలో జగనన్న సురక్ష కంటి అద్దాలను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇదివరకు కంటి పరీక్షలు చేసుకున్న వారందరికీ కంటి అద్దాలను ప్రభుత్వం ఉచితంగా అందించింది. ఆ కంటి అద్దాలను బుధవారం ఉదయం అరిగిలవారిపల్లెలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, పంచాయతీ అధ్యక్షుడు పానేటి చెంగ్రాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జగనన్న సురక్ష ద్వారా అనేక వైద్య పరీక్షలను నిర్వహించారని, అందులో భాగంగా కంటి పరీక్షలను చేసుకున్న వారందరికి కంటి అద్దాలను ప్రభుత్వం ఉచితంగా అందజేసిందని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నియోజకవర్గంలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్ గోపాల్, నాగభూషణం, వైద్య సిబ్బంది తేజస్విని, నాగ, సుధారాణి, దీప, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ వ్యాధి నివారణ



మాట్లాడుతున్న వీసీ డి.భారతి

తిరుపతి సిటీ: అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని మహిళా వర్సిటీ వీసీ డి.భారతి పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసిన మాట్లాడుతూ విస్తృత పరిశోధనలు, సమాచార వ్యాప్తి ద్వారా ఈ మహమ్మారికి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. సేవా భావాన్ని అధ్యాపకులు, విద్యార్థినులు అలవర్చుకుని సమాజాన్ని అప్రమత్తం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ అరుణసులోచన, రుయా హాస్పిటల్ టెక్నికల్ ఆఫీసర్ బాలాజీ, ఎన్ఎస్ఎస్ బ్యూరో కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, ప్రాజెక్టు మేనేజర్ లలిత, డాక్టర్ నీరజ, డాక్టర్ సుజాత, డాక్టర్ కిషోరి, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు



ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

చంద్రగిరి: ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలకు అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జాకు పాల్పడుతూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. పట్టణంలోని సర్వే నంబరు 161/1, 163లోని దేవుడి మాన్యంతో పాటు వాగు పోరంబోకు ఉంది. బుధవారం అందులో కొంత మంది వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజావసరాల కోసం ఉంచిన ప్రభుత్వ భూమిలోని అక్రమ కట్టడాలను అడ్డుకుని, భవిష్యత్తుకు ఉపయోగించాలని కోరుతున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా.. ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వీఆర్ఓ భాస్కర్ తెలిపారు.